క్లుప్తంగా

నంది వాహనంపై ఊరేగిన శివయ్య



శివదేవుడికి హారతులిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం శివదేవునికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. గర్భాలయంలో కొలువైన శివదేవునికి అభిషేకం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రాత్రి గంగా, పార్వతి సమేత శివదేవుడికి నంది వాహనంపై గ్రామోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు.

ఆశ వర్కర్ల బైఠాయింపు

టి.నరసాపురం: జిల్లా అధికారులు జోక్యం చేసుకుని ఆశ వర్కర్ లక్ష్మీ మంగను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు కోరారు. ఈ మేరకు ఐదు రోజులుగా టి.నరసాపురంలో ఆశ వర్కర్లు చేపట్టిన ఆందోళనలో భాగంగా మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద బైఠాయించారు. ప్రధాన వీధిలో ప్రదర్శన చేసి, అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ రాజకీయ వేధింపుల్లో భాగంగానే లక్ష్మీ మంగను విధుల నుంచి తొలగించారని, ఆమెకు న్యాయం చేయని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం, లింగపాలెం, కామవరపుకోట తదితర మండలాలకు చెందిన ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవే లక్ష్యం



చందన

జంగారెడ్డిగూడెం రూరల్: ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని మద్ది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్వీ చందన అన్నారు. బదిలీల్లో భాగంగా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం ఏసీగా ఆమె బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆలయంలో పర్యటించి భక్తులకు అందుతోన్న సేవలపై ఆరా తీశారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు మంగళవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఒక రోజు ఆదాయం రూ.1,16,269 సమకూరింది.

కలప ట్రాక్టర్ల స్వాధీనం

టి.నరసాపురం: జామాయిల్ కలపతో ఉన్న 2 ట్రాక్టర్లను యర్రగుంటపల్లి ఫారెస్ట్ అధికారి నాగేశ్వరరావు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. మర్రిగూడెం పంచాయతీ గట్టుగూడెం సమీపంలోని అడవి నుంచి కొందరు వ్యక్తులు రెండు ట్రాక్టర్లపై జామాయిల్ కలపను అక్రమంగా తరలిస్తుండగా, సోమవారం రాత్రి గ్రామస్తులు, వీఎస్ఎస్ సభ్యులు అడ్డుకున్నారు. ఆ ట్రాక్టర్లను గ్రామంలో నిలుపుదల చేయగా, మంగళవారం ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రావి ఆకులో మహాత్మా గాంధీ ఆకృతి



రావి ఆకులో గాంధీ ఆకృతి

కామవరపుకోట: రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మధ్యాహ్నపు సాత్విక రావి ఆకులో మహాత్మా గాంధీ ఆకృతిని చిత్రీకరించి అబ్బురపరిచింది. గాంధీ జయంతి సందర్భంగా గాంధీ చిత్రాన్ని చిత్రీకరించడం పట్ల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

48.5 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్

కొయ్యలగూడెం: విజిలెన్స్ అధికారులు నిర్వహించిన దాడుల్లో 48.5 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. మంగళవారం రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.శ్రీరాంబాబు ఆధ్వర్యంలో బయ్యన్నగూడెంలోని వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఎంఎస్ మనోజ్ కుమార్‌కి చెందిన అనధికారిక గోడౌన్‌లో రూ.8,26,560 విలువ గల 32.10 మెట్రిక్ టన్నుల ఎరువులు, ఒ.హేమనాగేంద్ర కుమార్‌కు చెందిన సాయి ఎంటర్ ప్రైజెస్ దుకాణంలో రూ.2,82,800 విలువ గల 16.40 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలను గుర్తించామని శ్రీరాంబాబు తెలిపారు. స్టాక్‌ను సీజ్ చేసి, యజమానులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ విభాగాలకు చెందిన విజిలెన్సు అధికారులు ఇన్‌స్పెక్టర్ పి.శివరామ కృష్ణ, పి.సురేష్, బి.కన్యా కుమారి, కె.గంగాధరం పాల్గొన్నారన్నారు.

ఇసుక సమస్య పరిష్కరించాలి

చింతలపూడి: చింతలపూడిలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు, తమ్మిలేరు నుంచి ఇసుక తెచ్చుకొనేందుకు అనుమతి ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘం చింతలపూడి ఏరియా కమిటీ డిమాండ్ చేసింది. భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇసుక సమస్య పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు.

రోడ్లు ధ్వంసం.. ప్రమాదకరంగా ప్రయాణం

- జంగారెడ్డిగూడెం మండల ప్రజల ఆవేదన
- స్పందించని పాలకులు



ధ్వంసమైన పంగిడిగూడెం వెళ్లే రహదారి



చల్లవారిగూడెంలో రోడ్డు గోతుల్లో నిలిచిన వర్షపు నీరు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలంలో గ్రామీణ రహదారులు ధ్వంసమై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. వర్షం వస్తే రోడ్డు గోతుల్లో నీరు నిలిచి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. జంగారెడ్డిగూడెం మండలంలోని దేవులపల్లి నుంచి లక్కవరం వెళ్లే రహదారి, తాడువాయి నుంచి చల్లవారిగూడెం వెళ్లే రహదారి, శ్రీనివాసపురం నుంచి మైసన్నగూడెం వెళ్లే రహదారి, కేతవరం రహదారి, జంగారెడ్డిగూడెం నుంచి పేరంపేట మీదుగా పంగిడిగూడెం వెళ్లే రహదారులు ధ్వంసమవ్వడంతో వాహనచోదకులు రాకపోకల సమయంలో తరచూ అదుపుతప్పి ప్రమాదాల బారినపడుతున్నారు. ఈ రోడ్లపై రైతులు, మహిళలు, ఉద్యోగులు, నిర్వాసిత కాలనీల ప్రజలు, విద్యార్థులు నిత్యం రాకపోకలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాల్లోని ప్రజలంతా నిత్యావసర సరుకులు, అనేక అవసరాల నిమిత్తం జంగారెడ్డిగూడెం పట్టణానికి రావాల్సుంటుంది. రోడ్లు పాడవడంతో పడుతూ లేస్తూ ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో గోతులను గుర్తించేలోపే ప్రమాదాల బారిన పడి, ఆసుపత్రుల పాలవుతున్నామని వాహనచోదకులు, ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించి, వెంటనే పనులు చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



రహదారుల ధ్వంసమవ్వడంతో రాకపోకలు సాగించడానికి అనేక ఇబ్బందులు పడుతున్నాం. జంగారెడ్డిగూడెం నుంచి పంగిడిగూడెం వెళ్లే రహదారి ధ్వంసమైంది. గోతులమయంగా మారిన ఈ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో అయితే ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే ఎక్కడ ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని భయపడాల్సి వస్తోంది.

– నున్నా పవన్ కుమార్, పంగిడిగూడెం

నిధులు కేటాయించాలి



తాడువాయి నుంచి చల్లవారిగూడెం గ్రామానికి వెళ్లే రహదారి ధ్వంసం కావడంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. రహదారిపై పెద్ద గోతులు ఏర్పడి వర్షపు నీరు నిలిచిపోయి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. ఈ రహదారి మీదుగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు కూడా ఉండటంతో నిత్యం అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారు. నిధులు కేటాయించి రహదారి పనులు చేపట్టాలి.

– పసుపులేటి కిషోర్, చల్లవారిగూడెం

ఆర్థిక సాయం

చింతలపూడి: ఇటీవల మండలంలోని రాఘవాపురం గ్రామంలో గ్యాస్ బండ పేలి సంభవించిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన వెంకట నాగరాజుకు మానవత స్వచ్ఛంద సంస్థ మంగళవారం రూ.5 వేలు సాయం మాజీ సర్పంచ్ మాటూరి వెంకట్రామయ్య ద్వారా అందజేశారు. కార్యక్రమంలో మానవత చింతలపూడి శాఖ చైర్మన్ ఎ.అప్పారావు, కన్వీనర్ కె.నాగ చిన్నారావు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించండి



హాస్టల్‌లో బాలికల సమస్యలు తెలుసుకుంటున్న జడ్జి మధుబాబు

చింతలపూడి: వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు ఆదేశించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మంగళవారం పలు సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం, సురక్షితమైన తాగు నీటిని అందించాలని వసతి గృహ నిర్వాహకులకు సూచించారు. వసతి గృహాల్లో బాత్‌రూమ్‌ల సమస్య ఉందని పలువురు విద్యార్థినులు జడ్జి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే సమస్యను పరిష్కరించాలని నిర్వాహకులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.డేవిడ్ రాజు, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలి, సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల చోరీపై కేసులు

జంగారెడ్డిగూడెం: మోటార్ సైకిళ్ల చోరీపై పోలీసులు కేసులు నమోదు చేశారు. జంగారెడ్డిగూడెంకు చెందిన వై.చిన్న శ్రీను సెప్టెంబర్ 23వ తేదీ సాయంత్రం తన ఇంటి వద్ద తన మోటార్‌సైకిల్ చోరీకి గురైందని, అలాగే చింతలపూడి మండలం దేశవరం గ్రామానికి చెందిన కనిపెడ శరత్‌బాబు సెప్టెంబర్ 21న మోటార్ సైకిల్ జంగారెడ్డిగూడెంలో చోరీకి గురైందని పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. నాటి నుంచీ వెదికినా ఫలితం లేకపోయిందని బాధితులు పేర్కొన్నారు.

రక్తదానంతో ప్రాణం కాపాడాలి

జంగారెడ్డిగూడెం: ప్రతి విద్యార్థీ బాధ్యతగా రక్తదానం చేసి ఇతరుల ప్రాణం కాపాడేందుకు ముందుండాలని స్థానిక ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ మేరీ కమలా, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక చత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదానంపై ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్ బాబు అధ్యక్షతన మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ వి.హనుమంతరావు మాట్లాడుతూ ఇప్పటివరకు 132 మంది విద్యార్థులు రక్తదానం చేశారని తెలిపారు. రెడ్ రిబ్బన్ క్లబ్ మెంబర్ జి.వెంకట్రావు, రక్తదాత భావం సురేష్ శ్రావణ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావులను ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ, ఉద్యాన పంటలకు రాయితీలు



గవరవరంలో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: ఏపీఎంఐపీ ద్వారా వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఐదెకరాల్లోపు రైతులకు 90 శాతం, ఐదు ఎకరాలపైన భూమి ఉన్న రైతులకు 50 శాతం రాయితీతో రుణాలు అందిస్తున్నట్టు జిల్లా ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. మండలంలోని గవరవరం, రాజవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవికుమార్ రైతులకు పలు సూచనలు చేశారు. వెంకటరామన్నగూడెం కేవీకే నుంచి శాస్త్రవేత్త రాఘవ రెడ్డి భూమిలో పోషక యజమాన్యం, వరిలో ఎండాకు తెగులు నివారణ గురించి వివరించారు. వెటర్నరీ డాక్టర్ వీఆర్ శ్రీనివాస్ వెటర్నరీ డిపార్ట్‌మెంట్‌కు ఉండే పథకాలు, పశుపోషణ, వాటి యాజమాన్యం గురించి వివరించారు. ఉద్యాన శాఖ అధికారి ధీరజ్ ఉద్యాన శాఖ పథకాల, ఉద్యాన పంటలు పరిశీలన, పామాయిల్ పంటలో యజమాన్యం గురించి అవగాహన కల్పించారు. ఎంఈఓ ఎస్ చెన్నకేశవులు వరి పొలాలను సందర్శించి సూచనలు సలహాలు, వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాలను, ఈ పంట నమోదు మూడో తేదీలోపు పూర్తి చేయాలని ఈకేవైసీ కూడా చేసుకోవాలని సూచించారు.

సాగులో లాభాలు సాధించాలి

బుట్టాయగూడెం: పంటలు సాగు చేస్తున్న రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా మంచి లాభాలు సాధించవచ్చని ఏఓ బి.ముత్యాలరావు అన్నారు. మండలంలోని తెల్లంవారిగూడెం, సీతప్పగూడెం గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ముందుగా భూసార పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా పంటలు వేయాలని సూచించారు. సుస్థిర, సేంద్రియ పద్ధతులను అనుసరిస్తూ రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రకృతి సేద్య అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పురందేశ్వరి వ్యాఖ్యలు వివాదాస్పదం



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న గంగరాజు

కొయ్యలగూడెం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి వ్యాఖ్యలను దేశద్రోహ నేరంగా పరిగణించాలని వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. బయ్యన్నగూడెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఆయన కలిసి పాల్గొన్నారు. తిరుమల వ్యవహారంలో సీఎం చంద్రబాబు వ్యవహార శైలిని సుప్రీంకోర్టు తప్పు పట్టిన నేపథ్యంలో పురందేశ్వరి అత్యున్నత న్యాయస్థానంపై చేసిన వ్యాఖ్యలు అనుచితంగా, వివాదాస్పదంగా మారాయని తెలిపారు. ఎప్పటికైనా ప్రజలకు నిజం తెలియజేసి తిరుమల వెంకటేశ్వరస్వామి వారికి క్షమాపణ చెప్పాలని కూటమి నాయకులను ఆయన డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు నిలకడలేని మనస్తత్వానికి అద్దం పట్టే విధంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఆడమిల్లి విద్యార్థులు



రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన ఆడమిల్లి విద్యార్థులు

కామవరపుకోట: రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మండలంలోని ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు బి.విజయభారతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి నేషనల్ స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌లో తమ విద్యార్థులు హ్యాండ్ బాల్ అండర్-14 విభాగంలో భీమడోలు అక్షర, చేబోయిన రమ్య, పలగాని భూమిక ధన శ్రీ, బట్టు మాళవిక, చేబోయిన లక్ష్మి, మోతే చరణ చందు, వేముల రాజేష్, అండర్-17 విభాగంలో చంచల గుణ ప్రవళిక, సిద్ధబత్తుల చరణ్, తానేటి సందీప్ విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికనట్లు పేర్కొన్నారు. వీరితోపాటు, వ్యాయామ ఉపాధ్యాయులు మానుకొండ సుబ్బారావును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జి.కొత్తపల్లి విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ద్వారకాతిరుమల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్స్ ఆధ్వర్యంలో గత నెల 21 దేవరపల్లి మండలం పల్లంట్ల, 30న ఏలూరులో, నరసాపురం మండలం ఎల్బీచర్లలో నిర్వహించిన పోటీల్లో మండలంలోని జి.కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయి పోటీలకు 8 మంది ఎంపికయ్యారు. ఫుట్‌బాల్‌లో కె.రాజేష్, కె.జాస్మిన్, హ్యాండ్‌బాల్‌లో కె.మణిదీప్తి, ఎం.తేజ, టచ్ రగ్బీలో శ్రావణి, శరణ్య, మల్లీశ్వరి, కె.కీర్తి, జశ్వంత్ ఎంపికయ్యారు. గత ఏడాది కూడా రోప్ స్కిప్పింగ్‌లో తమ పాఠశాల విద్యార్థులు ముగ్గురు జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్, సిల్వర్ మెడల్స్ సాధించారు. విద్యార్థులను, వీరికి శిక్షణ ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడిని ప్రధానోపాధ్యాయులు లీలాకుమార్ మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్, ఎస్ఎంసీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ విక్రయంలో అక్రమాలు

అధికారుల తీరుపై సర్పంచ్‌ల ఆగ్రహం



ఎంపీడీఓ కార్యాలయ గదిలో ఉన్న స్క్రాప్

వేలేరుపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాయంలో టెండర్ లేకుండా అధికారులు విక్రయించిన పాత ఇనుము (స్క్రాప్) వ్యవహారంలో అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ కార్యాలయంలో గత కొంత కాలంగా నిల్వ ఉన్న మంచినీటి పంపుల పైపులు (ఇనుప గొట్టాలు), హ్యాండిల్స్, ఇతర ఇనుప సామగ్రి 40 క్వింటాళ్ల ఉండగా, అధికారులు కేవలం 14 క్వింటాళ్ల ఇనుము కేజీ రూ.27కు విక్రయించినట్లు నివేదికలు తయారు చేసినట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ 24న మండల పరిషత్ ఖాతాలో రూ.40,250 జమ చేశారు. మిగతా సుమారు రూ.67,750 ఇద్దరు అధికారులు కాజేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఎంపీడీఓ, సీనియర్ అసిస్టెంట్ ఇటీవల బదిలీ అయ్యారు. కానీ వారు ఇంకా రిలీవ్ కాలేదు. ఈ నేపథ్యంలో స్క్రాప్ విక్రయించి, అక్రమాలకు పాల్పడ్డారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బదిలీ అయినందున ఎవరూ ఏమీ చేయలేరనే ధీమాలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తిని సాక్షి వివరణ కోరగా, తాను ప్రభుత్వ నిబంధనల ప్రకారమే వేలం వేశామని, ఎలాంటి అక్రమాలు జరగలేదని, ఒక్క వ్యాపారే రావడంతో అతనికే ఇచ్చేశామని తెలిపారు. ఈ విషయం జిల్లా సీఈఓ దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. వేలం నిర్వహించకుండా ఒక్క వ్యాపారికే స్క్రాప్ ఎలా కట్టబెట్టారని రేపాకగొమ్ము, తాట్కూరుగొమ్ము సర్పంచ్‌లు సోయం వెంకమ్మ, కట్టి ఉదయ్‌కిరణ్ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

గిరిజన ప్రజాప్రతినిధులంటే అలుసా?

జనరల్‌బాడీ సమావేశంలో సభ్యుల ధ్వజం



వేలేరుపాడు ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశం

వేలేరుపాడు: తాము ఏ సమస్య చెప్పినా పట్టించుకోరని, సమావేశ ఏర్పాటు సమాచారం తెలియజేయరని, తామంటే ఎందుకంత చులకన అంటూ అధికారులపై ఎంపీపీ వాళ్ల లక్ష్మీదేవి అధ్యక్షతన మంగళవారం వేలేరుపాడు ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జనరల్ బాడీ సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకోసారి జరిగే ఈ సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు గైర్హాజరుకావడంతో మంగళవారం కూడా తూతూ మంత్రంగా సాగింది. సమావేశ సమాచారం కూడా తెలియజేకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో మొత్తం 9 గ్రామ పంచాయతీలుండగా ఇద్దరు సర్పంచ్‌లు, ఏడుగురు ఎంపీటీసీ సభ్యులకు ముగ్గురు హాజరయ్యారు. ఇందులో ఒకరు ఎంపీపీ కాగా, ఇద్దరు వైస్ ఎంపీపీలు ఉన్నారు. సమావేశానికి ప్రధాన శాఖలైన ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, పంచాయతీ రాజ్, ఎక్సైజ్, ఇతర శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. మండలంలో మంచినీటి సమస్య పట్టిపీడిస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా రామలక్ష్మి తెలిపారు. తన స్వగ్రామమైన పాతపూచిరాలలో మూడు నెలలుగా మంచినీటి పథకం పనిచేయడంలేదని, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని వాపోయారు. సమావేశంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ సూర్యనారాయణమూర్తి, వైస్ ఎంపీపీలు కేసగాని వెంకటేశ్వరమ్మ, మేడవరపు నాగశ్రీ, మేడేపల్లి, కొయిదా సర్పంచ్‌లు కట్టం రాంబాబు, అందాల సాంబ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న ఓఎన్‌జీసీ అధికారులు

పోలవరం రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఓఎన్‌జీసీ రాజమండ్రి కేజీ పీజీ బేసిన్ మేనేజర్ కె.కర్వానస్ అన్నారు. పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట గ్రామంలోని కోండ్రుకోట పునరావాస కేంద్రంలో 414 కుటుంబాలకు, గోపాలపురం మండలం సాగిపాడు పునరావాస కేంద్రంలోని 208 కుటుంబాలకు స్వచ్ఛ హరిత కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ మూడు మొక్కలు చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ కె.కర్వానస్ మాట్లాడుతూ ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ జి.అనిల్‌కుమార్ కోరిన మేరకు పునరావాస కేంద్రాల్లోని నిర్వాసితులకు కొబ్బరి, మామిడి, సపోటా వంటి ఫలసాయం ఇచ్చే మొక్కలు అందిస్తున్నట్టు చెప్పారు. అమ్మ పేరుతో ప్రతి ఇంటికీ మూడు మొక్కలు అందిస్తున్నామని, సామాజిక బాధ్యతలో భాగంగా ఓఎన్‌జీసీ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ పీవీఎస్ ప్రసాద్, జనరల్ మేనేజర్ పాల జైవార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఖైహీ కెమాస్, ఛీఫ్ జియో ఫిజిసిస్ట్ కె.ముత్తయ్య, కోండ్రుకోట సర్పంచ్ పైదా నాగరాజు, కె.సిలోమాన్, గ్రామస్తులు, పాల్గొన్నారు.

మద్యం సేల్స్‌మెన్లను కొనసాగించాలి

బుట్టాయగూడెం: మద్యం దుకాణాల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న సేల్స్‌మెన్‌లు, సూపర్ వైజర్లను కూటమి ప్రభుత్వం కొనసాగించాలని కోరుతూ మంగళవారం బుట్టాయగూడెం మండలంలోని మద్యం దుకాణాలను బంద్ చేశారు. ఈ సందర్భంగా సేల్స్‌మెన్‌లు గగ్గలోతు జయరాజు, తెల్లం సురేష్, కోర్సా శ్రీను, పిడికపాటి దుర్గారావు తదితరులు మాట్లాడారు.

వరద బాధితులకు సాయం

జంగారెడ్డిగూడెం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జంగారెడ్డిగూడెం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హోల్‌సేల్, రిటైల్ వర్తకులు రూ.75 వేల చెక్కును ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌కు అందజేశారు. వరదలు సమయంలో కూడా అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.50 వేల విలువైన అత్యవసర మందులను విజయవాడ పంపించామని సభ్యులు తెలిపారు.


పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్బుల ఏర్పాటు

ద్వారకాతిరుమల: తిరుమలంపాలెం హైస్కూల్లో మంగళవారం వినియోగదారుల క్లబ్బు ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం శేషు కుమారి అధ్యక్షతన విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఉపాధ్యాయుడు బంగారు రాజు క్లబ్ నిర్వహణకు ఎంపికైన విద్యార్థులను సభకు పరిచయం చేశారు. జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు వంటిపల్లి విజయకృష్ణ పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సభ్యులతో ప్రమాణం చేయించారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారికి గాయాలు

కుక్కునూరు: చిన్నారిని వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో తలకు గాయమైంది. వింజరం గ్రామానికి చెందిన దాసరి విన్సీ (6) చీరవెల్లి ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతుంది. మంగళవారం పాఠశాల నుంచి ఇంటికి వచ్చే క్రమంలో విన్సీ రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయమైన చిన్నారిని కుటుంబ సభ్యులు కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఆసుపత్రికి తరలించారు.

'ఆదాయం వస్తుందనే అజెండాలో చేర్చాం'



బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వానికి ఆదాయం వస్తుందనే ఉద్దేశంతోనే సర్వే నెంబర్ 359లోని ప్లాట్ల అనుమతుల విషయం అజెండాలో చేర్చినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్లాట్ల అప్రూవల్‌కు సంబంధించి జరిగిన అభ్యంతరాలపై ఆమె మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. అప్పట్లో రియల్టర్ 9.4 ఎకరాలలో 133 ప్లాట్లు విడదీసి అమ్మకానికి దరఖాస్తు చేయగా, నాటి పాలకవర్గం అనుమతులిచ్చిందన్నారు. అది కూడా 3 ప్లాట్‌లకు మాత్రమే అనుమతులు ఉన్నాయని తెలిపారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన క్రమంలో సదరు ఫ్లాట్‌లకు అనుమతులు నిలిపివేశారని చెప్పారు. నిబంధనలు అనుసరించి 14 శాతం కట్టించుకుని అనుమతులు ఇప్పించాలని యజమానులు కోరారని తెలిపారు. దీంతో 9.4 ఎకరాలకు ప్రభుత్వానికి సుమారు రూ.3.40 కోట్లు ఆదాయం వస్తుందనే ఉద్దేశంతో సెప్టెంబర్ 30న జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలోని అజెండాలో 27వ అంశంగా దీనిని చేర్చామని చెప్పారు. అయితే మార్చి 14న ఈ లేఅవుట్‌లకు సంబంధించి డీటీసీపీ జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీకి ఒక రిపోర్ట్ వచ్చిందని, ఈ విషయాన్ని కమిషనర్ నరేంద్రకుమార్ తన దృష్టికి తీసుకురాలేదని తెలిపారు. తీసుకువచ్చి ఉంటే దానిలో ఉన్న లోపాలను సరిచేసుకుని కౌన్సిల్ అజెండాలో పెట్టేవారమని వివరించారు. ప్లాట్‌లకు సంబంధించి ప్రభుత్వానికి, మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందనే ఉద్దేశమే తప్ప, తన స్వప్రయోజనాలు ఏమీ ఇందులో లేవని లక్ష్మి తెలిపారు. సమావేశంలో ఉగ్గం దుర్గాప్రసాద్, ముప్పిన రమణ, పెసరగంటి గంగ తదితరులు పాల్గొన్నారు.